క్లుప్తంగా

రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు


రొంపిచెర్ల : జనుము విత్తనాల పంపిణీ

రొంపిచెర్ల: రాయితీతో పంపిణీ చేసే పచ్చి రొట్ట విత్తనాలను రైతులు సద్వి నియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌బీకేలో సబ్సిడీ జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 44 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. 10 కిలోల బ్యాగ్ రూ. 840 ధర కాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.420కే పంపిణీ చేస్తోందని తెలిపారు. ఎకరాకు 12–15 కిలోల విత్తనం సరి పోతుందన్నారు. మామిడి, వరి పొలాల్లో వేసుకోవచ్చని తెలిపారు. నేలలో వేసిన 30–40 రోజులకు పూత దశకు వస్తుందన్నారు. అప్పుడు రోటావేటర్‌తో భూమిని కలయ దున్నాలని తెలిపారు. అన్నారు. దీని ద్వారా పంటకు పెట్టుబడిని తగ్గించ వచ్చున్నారు. మండలంలో 8 గ్రామ సచివాలయాల్లో జనుము పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆర్‌బీకే సహాయకుడు వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం


కందకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుగుణమ్మ

పులిచెర్ల(కల్లూరు): ఈఏడాది ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని కల్లూరు, పాళెం పంచాయతీల్లో ఉపాధిలో చేపట్టిన బౌండ్రీ ట్రెంచ్‌లను(కందకాల) పరిశీలించారు. వేసవిలో కూలీలకు పనుల ప్రదేశంలో నీడ, తాగు నీరు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పని దినాలను పెంచేలా చూడాలన్నారు. ఏపీఓ సౌకత్‌అలీ, ఈసీ కృష్ణ, టీఏ మోహన్ పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలకు ప్రతిపాదనలు

పులిచెర్ల(కల్లూరు): మండలానికి ఈఏడాది ఖరీఫ్‌లో వర్షా ధారపంటగా మెట్టప్రాంతాల్లో సాగు చేసేందుకు 1,095 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమని ప్రతి పాదనలు పంపినట్లు ఏఓ హరిప్రసాద్ మంగళవారం తెలిపారు. అలాగే 50 క్వింటాళ్ల జనుము విత్తనాలు కూడా వస్తాయని పేర్కొన్నారు. ఈఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా మండలంలో 375 ఎకరాల్లో రాగి పంట సాగును ప్రోత్సహించనున్నట్లు ఆయన తెలిపారు.

మోడల్ స్కూల్ టాపర్‌గా చందన


చందన

శాంతిపురం: ఇంటర్ మీడియెట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ బైపీసీ విద్యార్థిని ఈబీ. చందన వెయ్యికి 956 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపల్ లత ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే గ్రూపు విద్యార్థులు ఎస్.అమృత 939, వి.కవిత 901, ఎంపీసీలో ఎస్ఎస్ భవ్యశ్రీ 892, సీఈసీలో జగదీష్ 265 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు.

తాగు నీటిపై ప్రత్యేక దృష్టి


మెటార్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గుడుపల్లె: గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ రమణ తెలిపారు. మంగళవారం గుండ్లసాగరం గ్రామంలో బోరు మరమ్మతులకు గురైంది. వెంటనే ఆ గ్రామానికి వెళ్లి సమస్యను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. పైపులు లీకేజ్ కాకుండా చూడాలన్నారు. సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

సదుం: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సీపీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప హాజరవుతారని చెప్పారు. పార్టీ మండల కమిటీ, అనుబంధ విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఆకలి తీరుస్తున్న రాజన్న క్యాంటిన్

మూడు రాష్ట్రాల కూడలి కుప్పం పట్టణంలో రాజన్న క్యాంటిన్ పేదల ఆకలి తీరుస్తోంది. ఎమ్మెల్సీ భరత్ సారథ్యంలో క్యాంటిన్‌ను నిర్వహిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం రుచికరమైన.. నాణ్యమైన వంటకాలు అందిస్తున్నారు. నిత్యం వందలాది మందికి ఇక్కడి క్యాంటిన్ కడుపు నింపుతోంది. ప్రధానంగా కుప్పం పూల మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, గ్రామీణులకు ఈక్యాంటిన్ బాగా ఉపయోగపడుతోంది.

ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో నిర్వహణ
- నిత్యం వందలాది మంది ఆకలి తీరుస్తున్న క్యాంటిన్
- ఉదయం, మధ్యాహ్నం నాణ్యమైన వంటకాలు


రాజన్న క్యాంటిన్ వద్ద క్యూలో గ్రామీణులు


క్యాంటిన్ వద్ద భోజనం చేస్తున్న రైతులు

కుప్పం: పట్టణంలో రాజన్న క్యాంటిన్ వందలాది మంది ఆకలి తీరుస్తోంది. గతనెల 27వ తేదీన ఎమ్మెల్సీ భరత్ సారథ్యంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజన్న క్యాంటిన్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రధానంగా బైపాస్ రోడ్డులోని పూల దుకాణాల మార్కెట్‌కు నిత్యం వందల సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు వస్తుంటారు. కుప్పం చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా పూలను విక్రయించేందుకు కర్ణాటక రాష్ట్రం కామసముద్రం, కేజీఎఫ్, కోలార్ పట్టణాల పరిధిలోని రైతులు కూడా ఇక్కడి మార్కెట్‌కు వస్తుంటారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు, వేలూర్, కృష్ణగిరి, హోసూర్ ప్రాంతాల నుంచి వ్యాపారులు, రైతులు కూడా వందల సంఖ్యలో వస్తారు. మార్కెట్ ప్రాంతంలో రాజన్న క్యాంటిన్ ఏర్పాటు చేయడంతో వందలాది మంది ఇక్కడ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు. గతంలో మార్కెట్‌కు వచ్చే రైతులు టిఫిన్, భోజనాలకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. క్యాంటిన్‌లో ఉదయం రెండు రకాల టిఫిన్‌లు, మధ్యాహ్నం పెరుగన్నం, బిస్‌బెలాబాత్, టమాటా బాత్ అందిస్తున్నారు. పేదవర్గాలు, పూల మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులకు కడుపు నింపుతోంది. ఈ క్యాంటిన్ బాగా ఉపయోగపడుతోందని గ్రామీణ ప్రాంతాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా రుచిగా ఉంది



రాజన్న క్యాంటిన్‌లో ఆహార పదార్థాలు చాలా రుచికరంగా ఉన్నాయి. ఆకలి తీరే వరకు అడిగి మరి పెడుతున్నారు. ఇప్పటి వరకు కుప్పం ప్రాంతంలో ఉచితంగా పేదలకు భోజనం, టిఫిన్ పెట్టిన వారు లేరు. ఆకలి తీరుస్తున్న భరతన్న చల్లగా ఉండాలి. – రాజప్ప, మల్లేపల్లె

ఎమ్మెల్సీకి ధన్యవాదాలు



రాజన్న క్యాంటిన్ ఉదయం, మధ్యాహ్నం వందలాది మంది పేదల ఆకలి తీరుస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి కుప్పానికి వచ్చే వారికి టీఫన్, భోజనం అందించడం అభినందనీయం. రాజన్న పేరిట క్యాంటిన్ నడుపుతున్న ఎమ్మెల్సీ భరత్‌కు ధన్యవాదాలు. – గోవిందప్ప, కుప్పం

సీఎంను కలసిన ఎమ్మెల్సీ భరత్


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ భరత్, చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

కుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషాతో కలిసి ఎమ్మెల్సీ భరత్ కలిశారు. 'జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం కుప్పంలో విజయవంతంగా పూర్తి చేయడంపై భరత్‌ను సీఎం అభినందించారు.

పనిచేయని బీఎస్ఎన్ఎల్ సేవలు

చౌడేపల్లె: బీఎస్ఎన్ఎల్ (బ్రాండ్‌బ్యాండ్) సేవలు పనిచేయకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మంగళవారం కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని వివిధ సేవల కోసం కార్యాలయాల వద్దకు వచ్చిన వారు ఆరోపించారు. మండల స్థాయి అధికారుల బీఎస్ఎన్ఎల్ మొబైల్ సిమ్‌లు సైతం పనిచేయడం లేదు. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 45 కోట్లతో ఎంబీటీ రోడ్డు నిర్మాణం


రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్, చిత్రంలో అలీమ్‌బాషా, నాగభూషణం

పుంగనూరు: పట్టణంలో రూ.45 కోట్లతో 10 కిలోమీటర్ల ఎంబీటీ రోడ్డును అత్యంత సుందరంగా నిర్మించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎస్‌హెచ్‌ఏఈ అజయ్‌తో కలసి ఎంబీటీ రోడ్డును పరిశీలించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిల సహకారంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్డు 13 మీటర్ల వెడల్పుతో మూడు మీటర్లలో ఇరువైపులా కాలువలు, పాదచారుల బాటతో పాటు డివైడర్లు, ఎల్ఈడీ లైట్లు అమర్చి పట్టణాన్ని సుందరంగా రూపుదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. నాగభూషణం మాట్లాడుతూ రోడ్డును సుందరంగా నిర్మించి, పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు డిజైన్‌ను పరిశీలించారు. రోడ్డును భీమగానిపల్లె నుంచి పట్టణ మీదుగా గుడిసెబండ వద్దకు కలుపుతామన్నారు. పట్టణాభివృద్ధికి ప్రజలందరు సహకరించాలని కోరారు. మున్సిపల్ డీఈఈ మహేష్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, సీమ జిల్లాల వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెంకటేష్, కౌన్సిలర్లు నటరాజ, నరసింహులు, జేపీయాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


అగర్‌బత్తి కాలనీలో సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ ఆరో వార్డు పరిధిలోని అగర్‌బత్తి కాలనీ, గొబ్బిళ్లకోటూరు, గంటావూరు, బీసీ కాలనీల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్రతో కలిసి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధితో సంతృప్తిగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడిక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అగర్‌బత్తి కాలనీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన సేవలు, మేలును జనం గుర్తుంచుకుంటున్నారని తెలిపారు. ఎవరిని పలకరించినా ప్రభుత్వ పథకాలందుతున్నాయని, తాము సంతోషంగా ఉన్నామని చెబుతున్నారన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా తాము నమ్మమని, ఈ దఫా సైతం జగనన్నను ఆదరిస్తామని చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వంలో పథకాలు అర్హులైన వారికి పార్టీలు, వర్గాలతో సంబంధం లేకుండా అందుతున్నాయని, అందుకే ఏ ఇంటి వద్దకెళ్లినా జనం సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ హమంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, టౌన్ కన్వీనర్ జాఫర్, మున్సిపల్ వైస్ చైర్మెన్లు చాన్మాకమాల్, కిరణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మెన్ రఘునాథ్, నాయకులు మండీ సుధా, కోదండరామయ్య, మున్నా షర్మిల, శ్యామ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులకే బంజరు భూములు

రొంపిచెర్ల: అర్హులకే బంజరు భూములను పంపిణీ చేస్తామని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. భూ పంపిణీపై ప్రజా ప్రతి నిధులు, అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. మండలంలో మొదటగా గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె, జాండ్లవారిపల్లె, రొంపిచెర్ల, బోడిపాటివారిపల్లె పంచాయతీల్లో భూ పంపిణీ ఉంటుందన్నారు. రెండవ విడత బొమ్మయ్యగారిపల్లె, చల్లావారిపల్లె, పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె పంచాయతీల్లో ఉంటుందని తెలిపారు. రెవెన్యూ అధికారులు భూ పంపిణీలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, తహశీల్దార్ అమరనాథ్, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, సుధారాణి, జీవలత, హేమలత, ఎంపీటీసీ సభ్యులు విజయశేఖర్, లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్ప పల్లకి సేవ


పుష్పపల్లకిపై అమ్మవారు


తపస్సుమాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లె శ్రీ ద్రౌపది ధర్మారాజుల ఆలయ మహా భారత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పుష్ప పల్లకి సేవ వైభవంగా జరిగింది. ఉదయం అర్జున తపస్సుమాన్ కార్యక్రమం అలరించింది. అర్జున వేషధారి తపస్సుమాను ఎక్కే ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అశేషంగా తరలి వచ్చారు. అర్జున వేషధారి ఆలయ ప్రదక్షిణగా తపస్సుమాను వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం నిమ్మపండ్లు, పూజా సామగ్రితో పరమశివుని అనుగ్రహం కోసం తపస్సుమాను అధిరోహించారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. తపస్సుమాను పైకి ఎక్కి, పూజల అనంతరం నిమ్మపండ్లను కిందికి విసిరారు. దీన్ని అందుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన భక్తజనంతో గ్రామం సందడిగా మారింది. రాత్రి మంగళ వాయిద్యాల నడుమ పుష్పపల్లకి ఉత్సవం వేడుకగా జరిగింది. అనంతరం ఆలయం వద్ద బాణ సంచా వేడుకలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

భూ తగాదా: నలుగురిపై కేసు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ ఆకులవారిపల్లెకు చెందిన జి.బయ్యారెడ్డి, అతని సమీప బంధువులు ఇంటి జాగా విషయమై సోమవారం గొడవ పడ్డారు. ఈ క్రమంలో ప్రత్యర్థులు నలుగురు బయ్యారెడ్డిపై దాడి చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చంద్రబాబు తెలిపారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు


సూచనలిస్తున్న సీఐ అశోక్


పుంగనూరు: వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

బైరెడ్డిపల్లె : కర్ణాటక రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం గంగవరం సీఐ అశోక్ దాసారపల్లె సరిహద్దులో తనిఖీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సరిహద్దులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. డబ్బు, మద్యం పంపిణీ కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్‌ఐ వెంకటనరసింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు: కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మార్లపల్లె క్రాస్‌లో మంగళవారం చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో ముందుజాగ్రత్తగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాత్రి , పగలు కర్ణాటకకు వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. డబ్బు, మద్యం, రవాణా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేకాలంకారంలో చౌడేశ్వరిదేవి

పుంగనూరు: మండలంలోని చదళ్ల గ్రామంలో శ్రీచౌడేశ్వరి అమ్మవారి ఆలయ 5వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హోమాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన


మాట్లాడుతున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె : గ్రామీణులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఆశావర్కర్లకు వైద్యాధికారి విజయ్‌చంద్ర సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ జాగ్రత్తలను వివరించాలన్నారు. సీహెచ్ఓ అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా దాచూరి వర్ధంతి


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి వర్ధంతిని మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ శశికుమార్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ట్రెజరర్ శరవణ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విలువలతోనే వ్యక్తిత్వ వికాసం

పలమనేరు: విలువలను నేర్చుకొని వాటిని పాటించడం ద్వారా వ్యక్తిత్వ వికసిస్తుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. నైతిక విలువలపై స్థానిక కళామందిరంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షకులు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, పుష్ప, గురుమూర్తి, సుదర్శనాచారి, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

వి.కోట: ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో(2023–24) ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన చెందిన వారు, అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాలకు (బీసీ, మైనారిటీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి రూ.1,40,000 ప్రాతిపదికగా తీసుకుని, వారి పిల్లలను అర్హులుగా నిర్ణయించినట్లు తెలిపారు. దరఖాస్తులను http;//creapgov.in వెబ్‌సైట్ లో ఈనెల 6వ తేదీ నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

శాంతిపురం: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) కింద ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం సీట్లలో 25 శాతం పేద విద్యార్థులకు కేటాయిస్తామని చెప్పారు. వివరాల కోసం ఎంఈవో కార్యాలయంలో సంప్రదించ వచ్చని తెలిపారు.

రొంపిచెర్ల: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరే పేద విద్యార్థులకు 25 శాతం సీట్లును ఉచితంగా కేటాయించినట్లు ఎంఈవో హసన్‌బాషా తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

కనుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రథంపై విహరిస్తూ భక్తులను పార్వతీ పరమేశ్వరులు అనుగ్రహించారు. ఉదయం వేదపండితులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. అనంతరం ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. మేళ తాళాలు, కళాకారుల కోలాట నృత్యాల నడుమ పార్వతీపరమేశ్వరులు పురవీధుల్లో రథంపై విహరించారు. ఇంటింటి వద్ద మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. భక్తులకు మజ్జిగ, ప్రసాదాలు అందజేశారు.

వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి

పలమనేరు: పట్టణ సమీపంలోని సిల్క్ ఫామ్ వద్ద నివాసం ఉంటున్న రిజ్వాన్‌కు పక్కనే కాపురముంటున్న తన్నుకు మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. కాలనీకి చెందిన పెద్దలు రాజీ కుదర్చారు. మంగళవారం ఉదయం రజ్వాన్ ఇంటి వద్ద ఉండగా తన్ను ఇనుపరాడ్‌తో తలపై కొట్టి గాయపరిచాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో ఉంది.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

సదుం: మహిళ అదృశ్యంపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని దిగువ కురవపల్లెకు చెందిన చెంగయ్య కుమార్తె గోవిందమ్మకు మతిస్థిమితం లేదు. గత నెల 23న ఇంటి నుంచి వెళ్లిపోయింది. పలు చోట్ల గాలించినా ఆచూకి లభించ లేదు. ఈమేరకు ఆమె తమ్ముడు మొగిలప్ప మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 35మంది ఎంపిక


నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో తృతీయ సంవత్సర విద్యార్థులకు మంగళవారం క్యాంపస్ సెలక్షన్స్ జరిగాయి. ఫస్ట్‌సోలార్, అవిజా ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌టీవీ టెక్నాలజి తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 35మంది ఎంపికైయ్యారు. ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పద్మారావు, డీడీ రామకృష్ణ నియమాపక పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ మహమూద్, అధ్యాపకులు పాల్గొన్నారు.